ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025



పాత రహదారికి కొత్త శోభ

షాద్‌నగర్‌లోని పాత జాతీయ రహదారి కొత్తశోభను సంతరించుకుంది. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లపై అర్బన్ ఫారెస్టు శాఖ అధికారులు ఏర్పాటు చేసిన మొక్కలు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దశాబ్దాల తరబడి రోడ్డంతా గుంతలమయంగా ఉండిపోయింది. షాద్‌నగర్ పట్టణ చౌరస్తా నుంచి సోలిపూర్ బైపాస్ చౌరస్తా వరకు వాహనాల రాకపోకలు అటుంచితే.. కాలినడకకు సైతం ఇబ్బందిగా ఉండేది. రోడ్డు దుస్థితిని గమనించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాత రహదారి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.50కోట్లు మంజూరు చేయించారు. పనులు పూర్తికావడంతో ప్రస్తుతం రహదారి అద్దంలా మెరుస్తుంది. దీనికి తోడు పూలమొక్కలు కనువిందు చేస్తున్నాయి.

షాద్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)

పర్యాటకం అభివృద్ధికి

పెద్దపీట

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల పునరుద్ధరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రముఖ దేవాలయాలను ఆధునికీకరించి మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. తలకొండపల్లి మండలం అంతారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గ్రామ నాయకులు, ఆలయ నిర్వాహకులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే మిషన్ భగీరథ తాగునీరు, విద్యుత్ సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ్మ, ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు రాములు, జగతయ్య, కిశోర్, లింగం ఉన్నారు.

రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్
పొంచి ఉన్న ప్రమాదం 8

సన్మార్గంతోనే దైవానుగ్రహం
ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి 6

సర్కార్ బడుల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు, జీతాలు సకాలంలో అందక అవస్థలు పడుతున్నారు. నెలల కొద్దీ పెండింగ్‌లో ఉండటంతో పడరాని పాట్లు పడుతున్నారు. వంట చేయడానికి అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బిల్లుల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మికులు ఆందోళనకు దిగాలని నిర్ణయించారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండటం ఆపేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడానికి సిద్ధమయ్యారు.

బిల్లులు ఇవ్వరు..
వేతనం చెల్లించరు

పాత అప్పు తీరడం లేదు..
కొత్త అప్పు పుట్టడం లేదు

నేడు పాఠశాలల్లో
మధ్యాహ్నం భోజనం బంద్

సమస్యలు పరిష్కారానికి
చలో కలెక్టరేట్


ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

బకాయి.. పేరుకుపోయి!

కష్టాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం చేసే మధ్యాహ్నం భోజనం బిల్లులు సకాలంలో అందక ఏజెన్సీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. నెలల కొద్దీ పెండింగ్‌లో ఉండటంతో నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బిల్లులు చెల్లించకుంటే మధ్యాహ్న భోజనం వండేదెలా అని ప్రశ్నిస్తున్నారు. వంట సామగ్రి ఇచ్చిన దుకాణదారులకు ప్రతీనెల క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు వడ్డీకి అప్పులు తెచ్చి మరీ సరుకులకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. పాత అప్పు తీరడం లేదు.. కొత్తగా ఎవరూ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో మధ్యాహ్న భోజన నిర్వహణ భారంగా మారుతుందని వాపోతున్నారు. మధ్యాహ్నం వంటచేసే కార్మికులకు ప్రభుత్వం ప్రతీనెల రూ.2వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉండగా, అవికూడా 2024 ఆగస్టు నెల నుంచి



ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు.

పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం అందించి సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే సంకల్పంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది. అధికారులు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ పథకం గాడి తప్పుతోంది. జిల్లాలోని

మిగతా 8వ పేజీలో...

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



ఏడు నెలల నుంచి ఉన్నత పాఠశాల, రెండు నెలల ప్రాథమిక పాఠశాలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గుడ్ల బిల్లులు ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు నెల నెలా సక్రమంగా అందక పోవడంతో కిరాణా షాపుల్లో అప్పులు పెరిగి పోతున్నాయి. కొందరు వ్యాపారుల సరుకులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంట గ్యాస్ ఇవ్వక పోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- అలవేలు, కేశంపేట, నెర్దపెల్లి స్కూల్

ముగిసిన హార్స్ రైడింగ్ పోటీలు


హార్స్ రైడింగ్ చేస్తున్న రైడర్లు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జన్వాడ నాసర్ పోలోలో నిర్వహిస్తున్న ఈక్వేస్ట్రియన్ పోటీలు ముగిశాయి. ఆదివారం పలువురు హార్స్ రైడర్లు ప్రతిభను కనబరిచారు. ఈక్వేస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ జూనియర్ హార్స్ రైడింగ్ క్వాలిఫైయింగ్ పోటీలలో మొత్తం 282 మంది హార్స్ రైడర్లు పాల్గొన్నారు. పోటీలలో రాయల్ కబాలో క్లబ్, రాంచో డి కబాలో క్లబ్, స్కాలెన్ క్లబ్, ఆర్మీ హార్స్ రైడింగ్ క్లబ్, ఫ్లయింగ్ సి స్టాబెన్ క్లబ్, నాసర్ స్కూల్ ఫర్ ఈక్వేస్ట్రియన్ ఆర్ట్ క్లబ్‌లకు చెందిన రైడర్లు పాల్గొన్నారు. అండర్-10లో 24మంది, అండర్-12లో 14మంది, అండర్-14లో 60మంది, అండర్-16లో 44మంది, అండర్-18లో 70మంది, ఓపెన్ కేటగిరీలో 70మంది హార్స్ రైడర్లు పాల్గొన్నారు. ఒక్కో కేటగిరీలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ రైడర్లకు నిర్వాహకులు మెడల్స్ అందజేశారు. అయితే ఐజామీర్ ఒక్కరే అండర్-14లో జాతీయ స్థాయికి అర్హత సాధించారు. డిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆమె పాల్గొననున్నారు. కార్యక్రమంలో నాసర్ పోలో సీఈఓ మీర్ హఫీజుద్దీన్ అహ్మద్, డైరెక్టర్ మీర్ మొహియుద్దీన్ అహ్మద్, కంట్రోలర్ మీర్ జమాలుద్దీన్ అహ్మద్ తెలిపారు.



బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

నేటినుంచి కీసరగుట్టపై
మహాశివరాత్రి జాతర

ఆరురోజుల పాటు స్వామివారికి ప్రత్యేక సేవా కార్యక్రమాలు
హాజరుకానున్న లక్షలాది మంది భక్తులు .. ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కీసర, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కీసరగుట్టలోని రామలింగేశ్వర స్వామి ఆలయం సర్వంగా సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాల్లో భాగంగా నేటి నుంచి ఆరు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేద పండితులు గణపతి శర్మ ఆధ్వర్యంలో పూజలతో పాటు, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని ప్రముఖులతో పాటు, లక్షలాది మంది భక్తులు హాజరుకానున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా దర్శనానికి ఐదు లైన్లను ఏర్పాటు చేశారు. అలాగే రద్దీ దృష్ట్యా క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తులకు మంచినీటి సరఫరా, ఉపావాస దీక్షలు చేపట్టే భక్తులకు దాతల సహాయంతో పాలు, ఖర్జూర పండ్లు

మిగతా 7వ పేజీలో...


భక్తుల కోసం సిద్ధం చేసిన లడ్డూ ప్రసాదం



భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేస్తాం. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూ ప్రసాదం తయారు చేశాం. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానుందన స్వామి వారి దర్శనానికి ఇబ్బంది లేకుండా క్యూలను ఏర్పాటు చేశాం.

-తటాకం నారాయణ శర్మ, ఆలయ చైర్మన్

ప్రవేశ పరీక్ష ప్రశాంతం



మహేశ్వరం గురుకుల పాఠశాల సెంటర్ వద్ద పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందడానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని గూడూరు గేటు వద్ద ఉన్న మహేశ్వరం గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్ష జరిగింది. సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, రెగ్యులర్‌తో పాటు 6, 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించారు. 565 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 552మంది పరీక్ష రాశారు. 13మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

మహేశ్వరం : గురుకుల ప్రవేశ పరీక్ష రాయడానికి ఓ విద్యార్థి తనకు కేటాయించిన సెంటర్‌కు కాకుండా పొరపాటున మరోచోటుకు వెళ్లడంతో మహేశ్వరం పోలీసులు సాయం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రిక్షిక అనే విద్యార్థిని కందుకూరులోని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్‌లో గురుకుల ప్రవేశ పరీక్ష సెంటర్ పడింది. పొరపాటున తల్లితో మహేశ్వరానికి వచ్చిన విద్యార్థిని సెంటర్ గురించి ఆందోళన పడుతుంటే మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు గమనించారు. విద్యార్థిని సమస్యను తెలుసుకొని పోలీసు వాహనంలో మహేశ్వరం నుంచి కందుకూరులోని సెంటర్ వద్దకు చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొందుర్గు మండలంలో..


చౌదరిగూడ : కొందుర్గు మండలంలోని ఎస్సీ గురుకుల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ సెంటర్‌లో 600 మంది విద్యార్థులకు గాను 595 మంది పరీక్షకు హాజరయ్యారు.


విద్యార్థినిని కందుకూరు సెంటర్‌కు చేర్చిన మహేశ్వరం పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, సెల్‌ఫోన్‌లు

గంజాయి పట్టివేత

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎయిర్‌పోర్టు పరిధిలోని బావర్చి దగ్గర ముచ్చింతల్‌కు చెందిన బొడ్డు భానుప్రసాద్, పెద్ద తూప్రా గ్రామానికి చెందిన బ్యాగరి సాయికిరణ్, సఫిల్‌గూడకు చెందిన రోహిత్ గంజాయి అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ ముగ్గురి నుంచి 156 గ్రాముల గంజాయి ప్యాకెట్‌లు, 5 సెల్‌ఫోన్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు.


రన్నరప్‌గా నిలిచిన రంగారెడ్డి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, పక్కన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

అలరించిన కబడ్డీ పోటీలు

ముగిసిన అంతర్ జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు
బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం
బాలుర విభాగంలో నల్గొండ జట్టు విజేతలు
ట్రోఫీ అందజేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌కు హాజరైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సమానమన్నారు. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి 960 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడం జిల్లా జట్టు తొలి స్థానంలో నిలువగా రంగారెడ్డి జిల్లా రన్నరప్‌గా నిలిచింది. కాగా వారికి స్పీకర్ ట్రోఫీ అందజేశారు. బాలుర విభాగంలో నల్గొండ జట్టు విజేతగా నిలవగా నాగర్ కర్నూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. క్రికెట్ వలంటీర్స్ టీం సహకారంతో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వినోద్ ముదిరాజ్ తెలిపారు. ఈ వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జిల్లా కబడ్డీ అధ్యక్షుడు పరుశురాంనాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాలే లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు క్రీడాకారులు, కోచ్‌లు, యువతి యువకులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయ సాధనకు పాటుపడాలి

నందిగామ, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): శివాజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, ఛత్రపతి శివాజీ అందరికీ ఆదర్శప్రాయుడని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం చర్ల అంతిరెడ్డిగూడలో బీసీ సంఘం నాయకులు మద్దూరి అశోక్ గౌడ్ సహకారంతో శివాజీ యూత్ నెలకొల్పిన శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే శంకర్ ఆదివారం ఆవిష్కరించారు. యువతకు స్ఫూర్తిదాత ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, నర్సింహ, చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, అన్వర్, శశి, రఘుగౌడ్, రాజు, వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సన్మార్గంతోనే దైవానుగ్రహం

ఆమనగల్లు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సన్మార్గంతోనే దైవానుగ్రహం సాధ్యమన్నారు. కడ్తాలలో ఆదివారం ఆయన పర్యటించారు. చల్లంపల్లి శ్రీశివ, సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యానికి ప్రతీ నెల రూ.5వేలు ఇస్తానని ప్రకటించి రూ.5వేల చెక్కును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవనాన్ని పొందుతారన్నారు. చల్లంపల్లి గ్రామాభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అంజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కార్యదర్శులు చంద్రశేఖర్, పవన్‌కుమార్ రెడ్డి, బాల్‌రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్, మెంబర్లు అశోక్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, శ్రీశైలం, శ్రీరామ్, ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కడ్తాలలో పలువురు బాధిత కుటుంబాలను వంశీచంద్ పరామర్శించారు. ఆయనతో గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాటనర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, బిక్యానాయక్, బిచ్యానాయక్, మల్లేశ్ గౌడ్, బాల్‌రాజ్, జగన్ తదితరులు ఉన్నారు.


వంశీచంద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆటల్లోనూ యువత రాణించాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): యువకులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని, క్రికెట్‌పై యువత ఆసక్తి చూపుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఈనెల 26న శివరాత్రి సందర్భంగా నందివనపర్తిలో మాజీ సర్పంచ్ రాజునాయక్ తన తల్లి రూప్లీ పేరిట నిర్వహిస్తున్న పోటీలనుఆదివారం ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఆటలు యువతలో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉద్యోగార్థులకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. యువత, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.రమేష్‌గౌడ్, ప్యాక్స్ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, నాయకులు రాజు నాయక్, కె.శ్రీశైలం, జెర్కోని రాజు, గోపాల్ తదితరులు ఉన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

బషీరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జీవన్గి శివరాత్రి జాతర ఉత్సవాల్లో భాగంగా బందోబస్తు ఏర్పాట్లపై బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ ఆదివారం ఆలయాన్నిసందర్శించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ, గ్రామపెద్దలతో సమావేశమై ఉత్సవాలకు సంబంధించి చర్చించారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అగ్నిగుండ మహోత్సవం,శివపార్వతుల కల్యాణం, రథోత్సవం, కుస్తీపట్లు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతాయని ఎస్ఐకి వివరించారు. అనంతరం ఎస్ఐ కుస్తీపట్లు జరిగే ప్రాంతాన్ని సందర్శించి కమిటీ నిర్వాహకులకు సూచనలు చేశారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్



లక్ష్మయ్య జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు

ఘనంగా శతాధిక వృద్ధుడి జన్మదిన వేడుక

పరిగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధుడి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎన్కెపల్లికి కెందిన పూడూరు లక్ష్మయ్య(101) భార్య మృతి చెందగా ఆయనకు ఒక కొడుకు ఆరుగురి కూతుళ్లు ఉన్నారు. వీరికి 23మంది మనవళ్ళు, మనవరాళ్ల సంతానం. వీరికి మరో 30మంది మునిమనవరాళ్లు. లక్ష్మయ్య వారసత్వంగా మొత్తం 53మంది కుటుంబ సభ్యులు. వీరందరి సమక్షంలో ఆదివారం 101జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకునాన్నారు.



అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన డేటా సమ్మిట్-2025 కార్యక్రమంలో విద్యార్థులు

అనురాగ్‌లో డేటా సైన్స్ సమ్మిట్-2025

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డేటాసైన్స్ సమ్మిట్-2025 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250మందికి పైగా పరిశ్రమల నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు డేటా సైన్స్‌లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్నాలజీ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ విజయకుమార్, డేటాసైన్స్ హెచ్‌వోడీ శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చౌదరిగూడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గుంజల్‌పహడ్‌లో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను గ్రామస్థులు వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం ఆంజనేయస్వామి, సీతారామచంద్రస్వామి, శివలింగం, నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు వారివారి ఇష్టదైవాలను కొలవాలని, ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే జీవనం ప్రశాంతంగా సాగుతుందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు యువత ప్రధానపాత్ర పోషించి సనాతన ధర్మాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, సింగిల్ విండో వైస్‌చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎలిమినేడులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిభట్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఎలిమినేడులో ఆదివారం ఇబ్రహీంపట్నం మాజీ వైస్ ఎంపీపీ వెంకటప్రతాప్‌రెడ్డి సహకారంతో నాయిని వెంకటేశ్వర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమం కింద కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయిని వెంకటేశ్వర్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేష్, మాజీ ఎంపీటీసీ భరత్‌రెడ్డి, నాయకులు నర్సింహ, మహేష్, బుగ్గ రాములు, మహేందర్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

బాధితులకు అండగా ఉంటాం

కడ్తాల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేదలు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ రెడ్డి భరోసా ఇచ్చారు. నిరుపేదలకు, బాధితులకు ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరారు. కడ్తాలలో ఆదివారం లక్ష్మీనర్సింహారెడ్డి పర్యటించారు. కాలనీల్లో తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో మృతిచెందిన కిష్టమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబీకులకు రూ.4,500 సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ చెన్నయ్య, కాశయ్య, జంగయ్య, సురేశ్ ఉన్నారు.

కల్యాణం కమనీయం

తాండూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శివస్వాములు నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తాండూరు పట్టణం బావిగి భద్రేశ్వర ఆలయంలో సోమవారం శివ దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. వేద పండితులు డాక్టర్ మహంతయ్యస్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్చరణ మధ్యన ఈ వేడుకలు జరిగాయి. కల్యాణానికి ముందు శివపార్వతుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి నిర్వహించిన ఊరేగింపు శోభాయమానంగా కొనసాగింది. కల్యాణోత్సవానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ రేనవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, వీరశైవ సమాజ పెద్దలు, సభ్యులు, శివదీక్షా సేవా సమితి సభ్యులు, శివస్వాములు హాజరయ్యారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లో ఆదివారం యాదవసంఘం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అవరణలో ప్రత్యేకంగా కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసి శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఒగ్గు కళాకారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణం జరిపించారు. అనంతరం ఆలయంలోని విగ్రహాలతో ప్రదక్షిణలు చేశారు. అగ్నిగుండాలు, గొలుసు తెంపుట కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మాజీ వార్డు సభ్యుడు పిట్టల రాజు, కొత్తకాపు జైపాల్‌రెడ్డి, మేడబోయిన రాజు, బద్దం కార్తీక్‌రెడ్డిలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి కల్యాణంలో విగ్రహాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

హరహర మహాదేవ..

భూకైలాస్‌లో బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- సొరంగమార్గం ద్వారా జ్యోతిర్లింగాల దర్శనం
- నూతనంగా ఏర్పాటైన 18శక్తి పీఠాలు
- నేటి నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలు



ఆలయ ఆవరణలో అమ్మవారి విగ్రహం

తాండూరురూరల్, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి) వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలం అంతారం తండాలో అద్భుతంగా తీర్చిదిద్దిన భూ కైలాస్ ఆలయం స్వర్గధామంగా విరాజిల్లుతోంది. ఇక్కడి అందాలను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. భక్తి పారవశ్యంతోపాటు అహ్లాదకరమైన వాతావరణం విశేషంగా ఆకర్షిస్తుంది. అంతారం తండాలోని 10ఎకరాల విస్తీర్ణంలో కోట్ల రూపాయలతో భూకైలాస్ ఆలయాన్ని తండాకు చెందిన కీర్తిశేషులు సేవ్యానాయక్ వంశం జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆల్ ఇండియా బంజార సంఘం ప్రతినిధులు వాసుపవార్ నాయక్, శంకర్‌నాయక్‌లు నిర్మించారు. గుడి గోపురాలు, మైమరిపించే బృందావనం సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు జిల్లాలోని నలుమూలల నుంచి అనేక మంది భూకైలాస్ తరలివస్తున్నారు. ఈనెల 24వ తేదీన జరిగే మహాశివరాత్రికి ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. గత నెలరోజులుగా ఆలయ ప్రాంగణంలో వాసుపవార్ నాయక్ అక్కడే ఉంటూ నూతనంగా 18శక్తి పీఠాలు, నవగ్రహాల ప్రతిష్ఠాపన, శనైశ్చర, రేణుకా ఎల్లమ్మ విగ్రహాలు, కోనేరులో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 24న గణపతిపూజ, 25న గౌరిపూజ, గంగపూజ, యాగశాల ప్రవేశం, మంటపారాధన, ధ్వజారోహణం, అగ్ని ప్రజ్వలన, గణపతిహోమం, 26న ఉదయం ద్వాదశ జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకం, భవానీమాత ఆలయంలో కుంకుమార్చన, రుద్రహోమం, పల్లకీసేవ, బోనాలు, అగ్నిగుండం, అభిషేకం, 27న ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తులతో పల్లకీసేవ, శివపార్వతుల కల్యాణం, పూర్ణాహుతి, తీర్థప్రసాదాల పంపిణీ, ముగింపు కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి నైవేద్యాలు, తీర్థప్రసాదాలతో అన్నదానం నర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ తెలిపారు.



ఆలయ ఆవరణలో శక్తిపీఠాలు



అంతారం తండాలోని భూకైలాస్ దేవాలయం

ఒకేచోట జ్యోతిర్లింగాలు

దేశంలో అత్యంత పవిత్రమైన ద్వాదశ జ్యోతిర్లింగాలు భూకైలాస్‌లో దర్శనమిస్తాయి. సొరంగ మార్గం ద్వారా నీటిలో ముందుకు సాగుతూ ఒక్కో లింగాన్ని దర్శించుకునేలా వీలు కల్పించారు. నడుము వరకు ఉన్న నీటి మట్టంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోవడం మధురానుభూతినిస్తుందని ఇక్కడికి వచ్చే భక్తులు పేర్కొంటున్నారు.

65అడుగుల శివుడి విగ్రహం

భూకైలాస్ ఆలయానికి 65అడుగుల శివుని విగ్రహం తలమానికమైంది. కళాకారులు ఎంతో శ్రమించి భారీఎత్తున శివుని విగ్రహాన్ని నిర్మించారు. భూకైలాస్‌కు వచ్చే భక్తులు భారీ శివుడి విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. అదేవిధంగా సాధారణంగా ఏదైనా ఆలయంలో ఒక దేవతామూర్తిని దర్శించుకునేందుకు వీలుంటుంది. కానీ భూకైలాస్‌లో అలా కాదు. హిందువులు పూజించే దేవుళ్లను ఇక్కడ ప్రతిష్ఠించారు. తదితర దేవతా మూర్తులను దర్శించుకోవచ్చు. అదేవిధంగా మరో విశిష్టత మండే అగ్నిగుండం. అంబా భవానీ, సేవాలాల్ దేవాలయం ముందు ఈ అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి నేటి వరకు నిరంతరంగా అగ్నిగుండం వెలుగుతూనే ఉంటుంది.

శనైశ్చర, రేణుకా ఎల్లమ్మ, బుద్ధ విగ్రహాల ప్రతిష్ఠాపన

ఆలయంలో నూతనంగా 18శక్తి పీఠాలతోపాటు నవగ్రహాలు, శనైశ్చరుడు, రేణుకా ఎల్లమ్మ దేవతా విగ్రహం ముందు పాదాలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అమ్మవారి విగ్రహం ఎదుట మూడు త్రిశూలాలు ఏర్పాటు చేశారు. వాటికి కోరిక కోరుకుని గాజు వేస్తే, అట్టి గాజు త్రిశూలానికి పడితే కోరిన కోరిక తీరుతుందని భక్తులు నమ్ముతారు. భూకైలాస్ దర్శించుకుని వచ్చే భక్తులకు నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చే ప్రతిభక్తులు ఇక్కడ భోజనం చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి



అంతారం భూకైలాస్‌లో ప్రతీ ఏడాది మహాశివరాత్రికి నిర్వహించే బ్రహోత్సవాలకు ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయంలో కొత్తగా చాలా దేవతల విగ్రహాలను ఏర్పాటు చేశాం. మహా శివరాత్రి సందర్భంగా నాలుగు రోజులపాటు వివిధ పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. శివుడి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశాం. ఈసారి భక్తులు పెద్దఎత్తున బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనే అవకాశం ఉంది.

వాసువాపర్ నాయక్, భూకైలాస్ వ్యవస్థాపకులు

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

కులకచర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతిలో ప్రవేశానికి 260 మంది విద్యార్థులకు 257 మంది పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. హాల్‌టికెట్‌లో పేరు తప్పుగా రావడంతో ఓ విద్యార్థిని పరీక్షకు అనుమతించలేదు. మండలంలోని తుర్క ఎన్కెపల్లికి చెందిన విద్యార్థి హాల్‌టికెట్‌లో మంగలి ఈశ్వర్ తండ్రి బ్యాగరి శ్రీనివాస్‌గా ఉంది. బోనోఫైడ్‌లో బ్యాగరి గణేశ్ తండ్రి పేరు బ్యాగరి శ్రీనివాస్‌గా ఉంది. హాల్‌టికెట్‌లో పేరు, కులం తప్పుగా నమోదైందని విద్యార్థి పరీక్షకు అనుమతించకుండా తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడి పంపించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి



బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)

పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆరు రోజులకు సరిపడా లడ్డూ, వడ, వంటి ప్రసాదాలు తయారు చేసి నిల్వ చేశారు. మొదటి రోజు మాఘ బహుళ ఏకాదశి సోమవారం రోజున ఉదయం విఘ్నేశ్వరుని పూజతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, పుణ్యాహవాచనము, రుత్విక్ వరణము, అఖండ జ్యోతి ప్రతిష్ఠాపన, అగ్ని ప్రతిష్ఠాపన. భేరిపూజ, ధ్వజారోహణ, ద్వాత్రింశతి రాగాలాపన, హారతి, మంత్రపుష్పం, పరాకస్తవం, తీర్థప్రసాదం వినియోగము, సాయకాలం శివదుర్గ సమేత రా మలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను గుట్ట నుంచి కీసర బయలుదేరడం.

రేపు స్వామివారి కల్యాణోత్సవం

రెండో రోజు మాఘ బహుళ ద్వాదశి మంగళవారం రోజున రుద్రస్వాహాకార హోమము, జ్వాలార్చన, హారతి, మంత్రపుష్పం, పరాకస్తం, తీర్థప్రసాద వినియోగం, ఉత్సవ మూర్తులు కీసర గ్రామం నుంచి పల్లకీసేవలో నడకదారిన కీసరగుట్ట చేరుకోవడం, అనంతరం శ్రవణ నక్షత్రయుక్త తుల లగ్నమందు శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వ స్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

ఓయో హోటల్‌ను వెంటనే తొలగించాలి



ఓయో హోటల్ వద్ద ఆందోళన చేస్తున్న నాగారం మున్సిపాలిటీ షిర్డీ సాయినగర్ కాలనీ వాసులు

కీసర రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన ఓయో హోటల్‌ను వెంటనే తొలగించాలని నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని షిర్డీ సాయినగర్ కాలనీ వాసులు డిమాండ్ చేసారు. ఆదివారం స్థానికులు రాంపల్లిలోని ఓయో హోటల్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంపల్లిలోని షిర్డీ సాయినగర్ కాలనీకి వెళ్లే దారిలో కొందరు ఓ భవంతిని కొందరు అద్దెకు తీసుకుని ఓయో హోటల్‌ను ఏర్పాటు చేసారని తెలిపారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలతో స్థానికులు అసౌకర్యాలనికి గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న ఓయో హోటల్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో షిర్డీ సాయి కాలనీ అసోయిసేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్, కాలనీ వాసులు జగన్‌రెడ్డి, గొంగల్ల కృష్ణ, చంద్రశేఖర్, జయపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, సాయికుమార్, వెంకన్న, వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

దోమ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన ఈడిగి రాంచంద్రయ్యగౌడ్ నెల రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల 50వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును కుటుంబసభ్యుడు జనార్ధన్‌గౌడ్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, బాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు టు ఫ్యూచర్‌సిటీకి మెట్రో

సర్వే పనులను పరిశీలించిన హైదరాబాద్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రో రైల్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఫ్యూచర్ సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్‌లను అభివృద్ధి చేసి, అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్వరితగతిన సులభంగా ఫ్యూచర్ సిటీకి చేరుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఎయిర్‌పోర్టు నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారు కోసం జరుగుతున్న సర్వే పనులను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలో మీటర్లు ఉంటుంది. ఇది ఎయిర్‌పోర్టు టెర్మినల్ నుంచి మొదలై, కొత్తగా ఏర్పాటు కానున్న మెట్రో రైల్ డిపో పక్క నుంచి ఎయిర్‌పోర్టు సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్‌పల్లి రోడ్డు గుండా 5కిలో మీటర్లు ముందుకు సాగుతుంది. అక్కడ నుంచి పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కి చేరుతుంది. బహదూర్‌గూడలో ఉన్న దాదాపు వేయి నుంచి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్దగోల్కొండలో రెండు మెట్రోస్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలో మీటర్ల పొడవున ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఓఆర్ఆర్‌లో మెట్రో రైల్‌కి కేటాయించిన భాగంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామన్నారు. రావిర్యాల ఎగ్జిట్ నుంచి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలో మీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ వరకు హెచ్ఎండీఏ 100మీటరు వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు మెట్రోకి కేటాయించారు. ఈ కేటాయించిన రోడ్డు మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ ఎట్‌గ్రేట్ మెట్రోగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.



కొంగరకలాన్‌లో సర్వే పనులు పరిశీలిస్తున్న అధికారులు

రామేశ్వరం జాతరకు ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం పుణ్యక్షేత్రానికి మంగళవారం నుంచి గురువారం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష ఆదివారం తెలిపారు. షాద్‌నగర్ నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపిస్తామని తెలిపారు. పెద్దలకు 30రూపాయలు, పిల్లలకు 20రూపాయల చార్జీలతో నడిపించే ప్రత్యేక బస్సులను రామేశ్వరానికి వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

పీఎం మన్‌కీ బాత్ విన్న నాయకులు

కేశంపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):మండల బీజేపీ అధ్యక్షురాలు రొల్లు రాధిక నేతృత్వంలో ఆదివారం ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' ప్రోగ్రాంను విన్నారు. అల్వాలలోని తన నివాసంలో కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి టెలివిజన్‌లో తెలుగు అనువాదంలో విన్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు రఘురాములుగౌడ్, శ్రీనివాస్, శంకరయ్య వనజాబాయి, మంగమ్మ పాల్గొన్నారు.


ఉప్పల ఉదారం.. ఆలయ నిర్మాణం

- రూ.2కోట్లతో గుడి నిర్మాణం
- 26న ప్రారంభానికి ఏర్పాట్లు
- నాగసాధువుల ఆగమనం

తలకొండపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత శివాలయం పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న ఆలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కళా సంపదతో ఆలయాన్ని నిర్మించారు. భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తలకొండపల్లిలోని నరసింహస్వామిగుట్ట వద్ద శతాబ్దాల క్రితం నిర్మించిన శివాలయాన్ని పునరుద్ధరించాలని స్థానికులు, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను కోరగా ఆలయ పునరుద్ధరణకు ఆయన ముందుకొచ్చారు. లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం ఎదురుగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.2కోట్లతో శివాలయాన్ని నిర్మించారు. ఏడాదిలో పనులు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన శివాలయం



పూర్తి చేశారు. గుట్ట కింది నుంచి పైవరకు కళాసంపదతో నిర్మాణాలు చేపట్టారు. ఈ నెల 26న మహా శివరాత్రి రోజున ఆలయాన్ని ప్రారంభించేందుకు ఉప్పల వెంకటేశ్-మంజుల దంపతులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి హిమాలయ నాగసాధువులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారు. శ్రుతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, ట్రస్ట్ సభ్యుడు బుచ్చిబాబు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

క్రైం కార్నర్

బకెట్‌లో పడి వృద్ధురాలి మృతి



వెంకటమ్మ(ఫైల్)

తలకొండపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన చీపునుంతలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటమ్మ(72) కొడుకు, కోడలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వెంకటమ్మ ఊరిలో ఒంటరిగా ఉంటోంది. శనివారం రాత్రి బాత్రూంలోకి వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు జారి నిండుగా నీళ్లున్న బకెట్‌లో తలపడింది. చేతి సంపులో చిక్కుకోవడంతో ఆమెకు లేచే వీలుకాలేదు. దీంతో ఊపిరాడక చనిపోయింది. ఆదివారం ఉదయం పాలుపోసేందుకొచ్చిన వ్యక్తి చూడగా వెంకటమ్మ చనిపోయింది. దీంతో గ్రామస్తులు ఆమె కుమారుడుకి సమాచారం ఇచ్చారు.

కుటుంబం అదృశ్యం

- కన్పించకుండా పోయిన దంపతులు, ఇద్దరు కుమారులు



అదృశ్యమైన భార్యాభర్తలు, కుమారులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు, వారి ఇద్దరు కుమారులు అదృశ్యమైన సంఘటపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్కుడకు చెందిన సుదర్శన్, తేజస్విని భార్యాభర్తలు, వారి ఇద్దరు కుమారులు జయవర్ధన్, ఆదిత్యజయవర్ధన్ అదృశ్యమయ్యారు. సుదర్శన్‌కు పెళ్లయిన తర్వాత సంవత్సరం వరకు వెంకటాపూర్‌లో ఉండి తర్వాత అత్తగారి ఊరు కర్మన్‌ఘాట్‌కు వెళ్లి ఏడేళ్ల పాటు కుటుంబంతో ఉన్నాడు. అక్కడ అప్పులపాలవడంతో మూడేళ్ల క్రితం నర్కుడ వచ్చి ఉంటున్నాడు. అయితే ఫిర్యాదుదారు గ్రామస్థుడైన ప్రభాకర్ చెబుతూ.. ఈ నెల 20న సుదర్శన్ తన వద్ద చిట్టీ ఎత్తుకొని రూ.2లక్షల బాకీ ఉన్నాడని, ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఎత్తడం లేదని ఎస్సై చెప్పారు. అతడు ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. ఆ ఇంటి యజమానిని అడుగగా ఈ నెల 18న వెళ్లి తిరిగి రాలేదని తెలిపాడన్నారు. అప్పుల బాధతోనే కుటుంబంతో సుదర్శన్ ఎక్కడికైనా వెళ్లిండొచ్చునని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి వివరించారు.

ఊట్పల్లిలో మహిళ...



అదృశ్యమైన మణెమ్మ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఊట్పల్లిలో జరిగింది. శంషాబాద్ ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వనపర్తికి చెందిన శ్రీవాటి మణెమ్మ, భాస్కర్ దంపతులు బతుకు దెరువు కోసం మండలంలోని ఊట్పల్లికి వచ్చి జీవనం సాగిస్తున్నారు. భాస్కర్ ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతాడు. జనవరి 31న భాస్కర్ సామాన్లు అమ్మేందుకు సంగారెడ్డికి వెళ్లి తిరిగి ఈ నెల 2న రాత్రి పది గంటలకు వారుంటున్న గుడిసె వద్దకు వచ్చాడు. అక్కడ భార్య మణెమ్మ కన్పించలేదు. మణెమ్మ ఎటుపోయిందని అతడి తండ్రి జమన్నను అడగగా అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు బయటకు వెళ్లి లేదని చెప్పాడు. మణెమ్మకు మతిస్థిమితం సరిగా లేదని, అప్పుడప్పుడు రోడ్డుపైకి వెళ్లి డబ్బులు అడుక్కొని కల్లు తాగి ఇంటికొచ్చేదని, గతంలోనూ ఇలాగే 20రోజులు పోయి తిరిగి వచ్చిందని తెలిపారు. ఎంతకూ రాకపోవడంతో భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



చేవెళ్లలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు యువత క్రీడల్లోనూ రాణించాలని, స్థానికంగా ఏర్పాటు చేసే క్రీడాపోటీలను సద్వినియెగం చేసుకోవాలని చేవెళ్ల మాజీ ఎంపీపీ మల్గారి విజయలక్ష్మీరమణారెడ్డి, చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ డి.వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో మాజీ జెడ్పీటీసీ పెద్దోళ్ల పర్మయ్య జ్ఞాపకర్థం ఆయన కుమారుడు దయాకర్ స్పాన్సర్ చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... క్రీడలతోనే శారీరాక ధారుడ్యం పెరుగుతుందన్నారు. మొత్తం 35టీంలు టోర్నీలో పాల్గొంటాయన్నారు. యువత ఈ టోర్నమెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, బీజేపీ మండల లేడీవింగ్ ప్రెసిడెంట్ దేవర సమతారెడ్డి, బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకుడు దయాకర్, క్రీడకారులు, యువకులు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు నాయకుడి చేయూత

కొత్తూర్: మున్సిపాలిటీ పరిధి ఎస్సీ కాలనీకి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు కిట్లు, కుర్చీలు, హైమాస్ట్ లైట్లను సామాజికసేవ యువ నాయకుడు తుప్పర రవి అందజేశారు. రవి యుకవకుల కోసం వాలీబాల్‌గ్రౌండ్ ఏర్పాటు చేయించి, కిట్లు అందజేశారు. క్రీడాకారులు రవి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్రోల్ల లక్ష్మయ్య, బి.సురేందర్, నవీన్, వినోద్, అనిల్, నాగేష్, చింటూ, క్రీడాకారులు పాల్గొన్నారు.



కొత్తూర్: యువ నాయకుడు తుప్పర రవిని సన్మానిస్తున్న క్రీడాకారులు, కాలనీ వాసులు

అభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవసరం

మొయినాబాద్ రూరల్: దేశాభివృద్ధిలో యువకులు, విద్యార్థుల భాగస్వామ్యం అవసరమని మేడిపల్లి నాయకుడు, సామాజిక సేవా కార్యకర్త కొత్తపల్లి సురేందర్ అన్నారు. గ్రామంలో సురేందర్ నిర్వహించిన క్రికెట్ టోర్నీ అదివారం ముగిసింది. విజేతలకు నగదు పారితోషికం, షీల్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. గ్రామానికి సేవ చేసేందుకు కృషిచేస్తానని, భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. అందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవీన్, గ్రామస్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గన్నారు.



క్రికెట్ టోర్నీ విజేతలతో కొత్తపల్లి సురేందర్

వాహనదారులకు ప్రాణసంకటంగా..

రోడ్డు పక్కన దుకాణాలు

- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్!



అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద రోడ్డు పక్కనే బొమ్మల దుకాణం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించకుండా కొందరు వీధి వ్యాపారులు రోడ్డు పక్కనే దుకాణాలను పెట్టి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. అజీజ్‌నగర్ చౌరస్తాలో హైదరాబాద్-బీజాపూర్ హైవే పక్కన కొందరు దుకాణాలను పెట్టి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు. హైదరాబాద్-బీజాపూర్ ఎక్కువగా బీజీ ఉంటూ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నాయి. దీంతో పోలీసులు, హైవే అథారిటీ అధికారులు రోడ్డు పక్కన ఆరేడు మీటర్ల వరకు ఎలాంటి దుకాణాలు నిర్వహించొద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పోలీసులు వారికి అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదు. శని, ఆదివారాల్లో ఈ రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్‌తో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న దుకాణాలతో ట్రాఫిక్ సమస్య జఠిలం అవుతోందని వాపోతున్నారు.

పాత రాయికి పూతపూసి!



విరిగిన పాత మైలు రాయి



మరమ్మతులు చేశారిలా..



దూరాన్ని తెలిపే రాత

- విరిగిన మైలురాయికే మరమ్మతు..

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ చౌరస్తా నుంచి 44వ జాతీయ రహదారి బైజంక్షన్ వరకు విస్తరించిన రోడ్డు పనుల్లో భాగంగా పాతిన సిమెంట్ మైలు రాయి(మైల్‌స్టోన్) విరిగిపోయింది. రూ.45కోట్లతో చౌరస్తా నుంచి బైజంక్షన్ వరకు, తిరిగి కొత్తూర్‌లో మిగిలిన రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. స్థానిక శుభోదయం షాపింగ్ మాల్ సమీపంలో పాతిన సిమెంట్ మైలు రాయిని వాహనం ఢీకొనగా విరిగిపోయింది. ఆ సిమెంట్ రాతి స్థానంలో కొత్తది పాతాల్సిన కాంట్రాక్టర్ అదే రాయికి చుట్టూ సిమెంట్ వేసి, కిలో మీటరు సూచిక రాయించారు. పాత రోడ్డులో విరిగిన రాయికి మరమ్మతు చేస్తే అర్థం ఉంది గానీ, కొత్తగా వేస్తున్న రోడ్డు పక్కన కూడా విరిగిన సిమెంట్ రాతికే మరమ్మతులు చేయడమేమిటని ప్రయాణికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. విరిగిన మైలురాయి స్థానంలో కొత్త రాయిని పాతించాలా చూడాలని ఆర్అండ్‌బీ అధికారులను వారు కోరుతున్నారు.

సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్న భక్తులు

తలకొండపల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): చెన్నారం మల్లప్ప మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని తోరణాలు, పూలతో అలంకరించారు. సమీప మండలాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. ఉదయం పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ అర్చకుడు సాహితి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో విశ్వేశ్వరచారి, రఘురామశర్మ, దత్తాత్రేయశర్మ, అక్షయశర్మ, దీపక్‌శర్మ, మధుశర్మ శాస్త్రోక్తంగా సాక్షిగణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, ఏమిరెడ్డి శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, పాండు, దామోదర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివడు, రఘుమారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు పంచ పల్లవేశ్వరాలయం ముస్తాబు

తలకొండపల్లి మండలం చుక్కపూర్‌లోని జ్యోతిష్య వైద్య విజ్ఞాన సేవాశ్రమంలో గల శ్రీ పంచ పల్లవేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది, యేటా మూడు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కొనసాగే వేడుకలకు నిర్వాహకులు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 25న విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, 26న అభిషేకాలు, ప్రదోష పూజలు, శివ పార్వతుల కల్యాణం, 27న అభిషేకాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామని శర్మ వివరించారు.



ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీకి విరాళాన్ని అందజేస్తున్న విజయలక్ష్మీరమణారెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధిలో ప్రతొక్కరూ భాగస్వాములు కావాలని చేవెళ్ల మాజీ ఎంపీపీ మల్గారి విజయలక్ష్మీరమణారెడ్డి అన్నారు. ఆదివారం మల్కాపూర్‌లో నెలకొన్న భువనేశ్వరీ సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో శివ మాలధారులు నిర్వహించిన పడిపూజలో వారు ఎంపీపీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. మల్లికార్జునాలయానికి తన వంతుగా రూ.లక్ష నగదును ఆలయ కమిటీకి అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేవుని శర్వలింగం, ఆంజనేయులుగౌడ్, అదెల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శేరి శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు ఇంద్రసేనారెడ్డి, అభిషేక్‌రెడ్డి, జయసింహారెడ్డి, ఆనంద్, శ్రీతం, సందీప్, అఖిల్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం



మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవీ కాలం ముగిసినా గతంలో తానిచ్చిన మాట ప్రకారం సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మాజీ సర్పంచ్. రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బసగళ్ల వినీతకరుణాకర్‌గౌడ్ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి అమ్మట్రస్టు ద్వారా రూ.30వేలు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 31 మందికి ఆమె సాయమందించారు. గ్రామానికి చెందిన శివనీల-రాములు కుమార్తె శ్రీజ పెళ్లి, అలాగే జెంగిళోల్ల చెన్నమ్మ, రవీందర్‌ల కుమార్తె లలిత వివాహం కూడా ఆదివారం జరగగా పెళ్లిళ్లకు హాజరై రూ.30వేల చొప్పున చెక్కులు పెళ్లికూతుళ్లకు అందజేశారు. తమ అమ్మట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. తనకు పదవితో సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి, కుండే గణేష్, దయానంద్ గౌడ్ గ్రామస్థులు ఉన్నారు.

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో...

పొంచి ఉన్న ముప్పు

- పట్టించుకోని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద పిచ్చిమొక్కల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి అనుకొని ఉన్న ఫెన్సింగ్‌లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. తహసీల్దార్ కార్యాలయం వెనుక, రోడ్డు పక్కన ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ పిల్లల చేతికందే ఎత్తులోనే ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేదు. చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయంతో పాటు, ఎంపీడీవో కార్యాలయం, నివాస సముదాయాల ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఇలా ప్రమాదకరంగా ఉంది. వాహనాల రాకపోకలతో పాటు, ప్రజలు ఎక్కువగా సంచరిస్తుంటారు. రోడ్డు కార్నర్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రజలు ఇక్కడ భయంతో వెళ్తుంటారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలోని కాలనీవాసులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనుంచి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది సైతం బిక్కుబిక్కు మంటూ వెళ్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ వేసి పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విజేతలకు బహుమలులు అందజేస్తున్న సబ్బరిగారి రాజు

షాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టోర్నమెంట్ నిర్వాహకుడు సబ్బరిగారి రాజు అన్నారు. బోడంపహాడ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. నాలుగు జట్లు తలపడగా విజేతలు బీపీడీ నైట్‌రైడర్స్ టీంకు రూ.10వేలు, రెండో బహుమతి బీపీడీ రాయల్ చాలెంజర్స్ జట్టుకు రూ.5వేలు, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌కు రూ.2,500 నగదు, షీల్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ... క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడుతాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, గ్రామస్తులు చెన్నరాములు, శేఖర్, అంజయ్య, శివయ్య, అంతయ్య, ఇనాయత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

- **తలకొండపల్లి:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాకు భోజన కార్మికులు తరలిరావాలన్నారు. ఎంఈవో చంప్లా నాయక్‌కు భోజన కార్మికులు వినతి పత్రం అందజేశారు.
- **ఆమనగల్లు:** మండల పరిధి ఆకుతోటపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గల ఆకుతోటపల్లి, సీతారామ్‌నగర్ తండాలలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆమనగల్లు ఏఈ శంకర్‌నాయక్ ఆదివారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ మరమ్మతులు, చెట్లకొమ్మల నరికివేత, లూజ్ లైన్లను టైట్ చేయడం వంటి పనులు చేస్తామన్నారు. నేటి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు సరఫరాలో అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని శంకర్ నాయక్ కోరారు.
- **మాడ్గుల:** మండల పరిధి కలకొండలో ఈ నెల 23 వరకు మూడు రోజులు నిర్వహించిన దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహిచారు. ఆదివారం చింతపల్లి వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సమీప గ్రామాల భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. పోశమ్మ, ఈదమ్మ, చెన్నకేశ్వరులకు బోనాలు సమర్పించారు. పోశమ్మ గుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలకొండకు చెందిన వెంకటయ్యగౌడ్ సొంత ఖర్చుతో ఆలయ నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠాపూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, శశివర్ధన్, వెంకటయ్య, కృష్ణయ్య, మల్లేస్ పాల్గొన్నారు.
- **చౌదరిగూడ:** కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఎల్లార్ఎస్ స్కీంను ఉపసంహరించుకోవాలని కొందుర్గు బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేదల జేబులను ఖాళీచేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు.

బకాయి.. పేరుకుపోయి!

(ఐదో పేజీ తరువాయి)

1,273 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో 264 స్కూళ్ల వరకు అక్షయ పాత్ర ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందుతోంది. జిల్లాలో 1,27,125 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి హాజరవుతున్నారు. మన్నా ట్రస్టు ఏజెన్సీ ద్వారా 78 పాఠశాల ల్లో 15,205 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కాగా గత 6 నెలల నుంచి గుడ్ల బిల్లులు పేరుకుపోయాయి. అలాగే 9,10వ తరగతి విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజన బిల్లులు ఏడు నెలలుగా ఇవ్వడం లేదు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు కార్మికులకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఆందోళనకు దిగడానికి సిద్ధమవుతున్నారు. నేడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని బంద్ చేసి చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

అందని వేతనం..

మధ్యాహ్నం భోజన కార్మికులకు వేతనం రూ. 2 వేలు పెంచి ప్రస్తుతం అందిస్తున్న వెయ్యి రూపాయలతో కలిపి మొత్తం రూ.3 వేలు చెల్లిస్తామన్న సీఎం హామీ అటకెక్కింది. 2022 మార్చి బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ హామీ ఇవ్వగా.. ఎన్నో పోరాటాల తర్వాత 2023 ఫిబ్రవరి 3వ తేదీన జీవో ఎంఎస్ నెంబర్ 8ని విడుదల చేశారు. జీవో విడుదలైన తర్వాత 8 నెలల వరకు రూ.2 వేల వేతనాన్ని అందించారు. తర్వాత నుంచి వేతనం రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వేతనం రూ.2వేలు వెంటనే అందివ్వాలని భోజన కార్మికులు కోరుతున్నారు.

కేంద్రం నుంచి ఓకే..

కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు ఇస్తున్న వెయ్యి రూపాయల వేతనం సకాలంలో వస్తున్నాయి. అలాగే ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు కేంద్రం ఇచ్చే మధ్యాహ్న భోజన బిల్లులు కూడా అందుతున్నాయి. కానీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించే భోజన బిల్లులు మాత్రం నెలల పాటు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ బిల్లుల కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్నాం



మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. గౌరవ వేతనం, బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నారు. ఆరు నెలలుగా గుడ్ల బిల్లు రావడం లేదు. కేంద్రం ఇచ్చే నిధులు సక్రమంగా వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచే ప్రతినెలా సక్రమంగా బిల్లులు అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం 9, 10 తరగతులకిచ్చే భోజన బిల్లు జూలై నుంచి పెండింగ్‌లో ఉంది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు గుడ్ల బిల్లు జూలై నుంచి ఇప్పటి వరకు రావాలి. ప్రభుత్వం ఇచ్చే వేతనం జూలై నుంచి రావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 8నెలల వరకు రూ.2వేల వేతనం ఇచ్చింది. ఆ తర్వాత జీతాలు రాలేదు.

- యెలమోని స్వప్న, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరం వద్ద మాట్లాడుతున్న వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో గ్రామాల్లో దశల వారీగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చేవెళ్ల బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఊరెళ్లలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ వైఎస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.